ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 24 సెప్టెంబరు 2024



రామప్ప భద్రత.. గాలిలో దీపమేనా?

- 20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే
- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల ఆక్షేపణలు

7



రక్షణ చర్యలకు నోచుకోని రామప్ప దేవాలయం ఆవరణలోని ఉప ఆలయం గొల్లాలగుడి




అది ప్రపంచ వారసత్వ సంపదగా.. యునెస్కో గుర్తింపు పొందిన.. ప్రాచీన శిల్పకళా సంపదకు నిలయమైన రామప్ప దేవాలయం. ఇక్కడ ప్రధాన ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలున్నాయి. ఈ అద్భుత కట్టడాలను తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. రక్షణ మాత్రం కరువైంది. ఇందుకు ఇటీవల రామప్ప అనుబంధ ఆలయమైన గొల్లాలగుడి వద్ద గుప్తనిధుల కోసం జరిగిన తవ్వకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాదు ఏకంగా వెయ్యి కిలోల బరువున్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కిందికి తోశారు. దీంతో రామలింగేశ్వరుడి రక్షణపై అనుమానాలు పెరుగుతున్నాయి. అయితే రామప్ప పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

- వెంకటాపూర్ (రామప్ప)

అనుమతుల కోసం అడ్డదారులు!

- ఫార్మసీ కళాశాలల కేయూ అధికారుల మాయాజాలం
- బోధన, పరిశోధన పరికరాలు, వసతుల్లేకున్నా ఓకే
- వర్సిటీ బృందం తనిఖీల్లో వెలుగులోకి వాస్తవాలు
- ఆ కమిటీ నిరాకరణ తర్వాత.. మరో కమిటీ నియామకంతో అనుమానాలు



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాల కోర్సుల నిర్వహణకు అనుమతులిచ్చే విషయంలో వర్సిటీ ఉన్నతాధికారులు అడ్డదారులు తొక్కారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు చివరి వారంలో తనిఖీల కోసం వర్సిటీ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన కమిటీని కాదని సెప్టెంబరు 6న మళ్లీ అదే కళాశాలలకు అనుమతి కోసం మరో కమిటీని నియామిస్తూ తీసుకున్న నిర్ణయమే ఇందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో డీ ఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ కళాశాలున్నాయి. ఒక్కో కళాశాల రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో పాటు సంబంధిత వర్సిటీ అనుమతి తీసుకుని కళాశాల నిర్వహించుకోవాల్సి ఉంటుంది. ఏటేటా సంబంధిత కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, బోధనేతర సౌకర్యాలపై వర్సిటీ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా తనిఖీలు చేపడతారు. ఆ తర్వాత అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయా కళాశాలలకు వర్సిటీ అనుబంధ గుర్తింపును కొనసాగిస్తోంది. అయితే 2024-25 ఏడాదికి గాను ఆగస్టు చివరి వారంలో వర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ కృష్ణవేణితో పాటు వర్సిటీలోని డీన్ అకాడమిక్, డీన్ సీడీసీ అధికారుల నేతృత్వంలో వర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాల తనిఖీలు చేపట్టారు. వీరు ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌లోని పలు ఫార్మసీ కళాశాలలను తనిఖీలు చేశారు.

వర్సిటీ తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు

వర్సిటీ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య నేతృత్వంలో వర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాలల్లో చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసినట్టు తెలిస్తోంది. ప్రధానంగా ఖమ్మంలోని 3 ఫార్మసీ కళాశాలల్లో సరైన బోధన, పరిశోధన పరికరాలు లేవని గుర్తించారు. అలాగే వాస్తవాలను వక్రీకరించి ఓ కళాశాల యాజమాన్యం తప్పుడు పత్రాలను సృష్టించినట్టు గుర్తించారు. దీంతో ఈ ఏడాదికి కోర్సుల అనుమతికి ఫార్మసీ డీన్ నేతృత్వంలోని తనిఖీల కమిటీ నిరాకరించింది. అంతేకాకుండా గతంలో ఆయా కళాశాలలకు ఎలా అనుమతులు ఇచ్చారనే అంశంపై ఆరా తీశారు. కళాశాలలో కనీస ప్రమాణాల్లేకుండా బోధన పరిశోధన ఏలా సాగించారనే విషయాలపై కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆ కళాశాల అనుమతుల విషయంలో గతంలో వర్సిటీ ఉన్నతాధికారులు వసూళ్లకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అదే కళాశాలల తనిఖీలకు మరో కమిటీ..



ఆగస్టు ఆఖరి వారంలో ఫార్మసీ కళాశాల అనుబంధ గుర్తింపు కోసం తనిఖీలకు నియమించిన ఫార్మసీ డీన్ కమిటీని కాదని వారం రోజుల్లోనే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి రెండో కమిటీని నియమించడం వర్సిటీలో వివాదాస్పదంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3 ఫార్మసీ కళాశాలలకు అనుమతులను నిరాకరించడంతో ఈనెల 6న మరో కమిటీని నియమించారనే విమర్శలున్నాయి. ఖమ్మంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ పలుకుబడిన కల్గిన నాయకులు వర్సిటీ ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచడంతోనే మరో కమిటీని నియమించి ఫార్మసీ కళాశాలకు అనుమతులు ఇప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

రెండో దఫా నియామించిన కమిటీలో వర్సిటీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలకు చెందిన డాక్టర్ స్వరూప, డాక్టర్ షయేదా. డాక్టర్ నాగరాజు, డీన్ సీడీసీ, డీన్ అకాడమిక్ అధికారుల బృందంతో మరో కమిటీని నియామించారు.

ఆరోపణలు ఇవే..

ఖమ్మంలోని మూడు ఫార్మసీ కళాశాలకు అనుమతులు నిరాకరించడంతో వాటిలో లోపాలపై చర్చలకు దారితీస్తోంది. ప్రధానంగా ఫార్మసీ కళాశాలకు ఆసుపత్రుల అనుబంధాలు లేవు. అలాగే సరైన బోధన సిబ్బంది లేరని, సరైన బోధన సిబ్బందితో పాటు కళాశాలకు సరైన రాష్ట్ర ప్రభుత్వ అనుమతుల్లేవని గుర్తించారు. వర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాలల్లో అనుమతులను మొదటి తనిఖీల కమిటీ నిరాకరించడంతో ఆయా కళాశాలల యాజమాన్యలు రాజకీయ పైరవీలు, ఒత్తిళ్లలు మొదలుపెట్టారు. మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ వీప్‌లు, ఎమ్మెల్యేలు, ఇతర పలుకుబడిన అధికార పార్టీ నేతలు వర్సిటీ ఉన్నతాధికారులపై పైరవీలకు దిగారు. ఒత్తిళ్ళు పెంచారు. ఎలాగైన తమ అనుచరుల కళాశాలకు ఫార్మసీ అనుబంధ గుర్తింపును కొనసాగించాలని తీవ్ర ప్రయత్నాలు మొదలెట్టారు.

సెకండ్ ఒపీనియన్ కోసమే రెండో కమిటీ

- ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రిజిస్ట్రార్, కేయూ వరంగల్



కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల 2024-25 ఏడాది వర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం మొదటి కమిటీని నియమించాం. అయితే కళాశాల యాజమాన్యాలు తమ అభ్యంతరాలతో వినతి పత్రాలను ఇచ్చాయి. కమిటీ వచ్చిన సమయంలో తాము ప్రిపరేషన్‌లో లేమని మరికొంత సమయం కావాలని అడిగాయి. దీంతో ఇన్‌చార్జి వీసీ ఐఎఎస్ అధికారి వాకాటి కరుణ అనుమతితో సెకండ్ ఒపినియన్ కోసమే రెండో కమిటీని నియమించాం. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు లేవు. పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగానే కమిటీలు పనిచేస్తాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం..

- అటవీ,పర్యావరణ,దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

ఆటోనగర్, సెప్టెంబరు 23: హైదరాబాద్ తర్వాత వరంగల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని అటవీ, పర్యావరణ, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గ్రేటర్ వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బి నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంత్రి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోగా జిల్లాను కొత్త మోడల్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం నాయకత్వంలో దూసుకుపోతుందన్నారు. తూర్పు నియోజకవర్గంలోని వరంగల్, ఖిలావరంగల్ మండలాలకు చెందిన 454 మంది లబ్ధిదారులకు రూ.3.97కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండి.ఫుర్ఖాన్, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులకు ప్రాధాన్యమివ్వాలి: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహించరాదన్నారు. ప్రజావాణిలో 149 వినతులు అందగా ఇందులో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 66 వచ్చినట్లు తెలిపారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవో కృష్ణవేణి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

తేలిన లెక్క

- ఖరీఫ్ సాగు 2.72 లక్షల ఎకరాలు
- జిల్లాలో వరి సాగే అధికం
- తర్వాతి స్థానంలో పత్తి, ఇతర పంటలు



వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 22: జిల్లాలో వానాకాలం(ఖరీఫ్) పంటల సాగు లెక్క తేలింది. ఏ పంట ఎన్ని ఎకరాలలో సాగు చేస్తున్నది వ్యవసాయశాఖ అధికా రులు క్షేత్రస్థాయిలో లెక్క కట్టారు. పంట దిగుబడుల అంచనా, కొనుగోళ్ల ప్రణాళిక, పంటల నష్ట పరిహారం పంపిణీకి ఈ సర్వే దోహద పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2.72లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరి లక్షా 28 వేల851 ఎకరాలు, పత్తి లక్షా 19వేల 158 ఎకరాలు, మిగితా 23వేల ఎకరాలలో మొక్కజొన్న, కందులు, పెసర ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఈసారి 88వేల ఎకరాలలో సన్నాలు సాగు చేస్తుండగా, సుమారు 42వేల ఎకరాలలో దొడ్డురకం సాగు చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు తేల్చారు.

బోనస్ రూ.500పై ఆశలు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులు పండించిన వరి ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఈ ఖరీఫ్(వానాకాలం) సీజన్ నుంచి బోనస్ ఇస్తామని ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. అక్టోబరు ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ధాన్యం(సన్నాలు) కింటాకు రూ.2,320, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ కలిపితే క్వింటా రూ.2820లు పలుకుతుంది.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు..

జిల్లాలో 1.28లక్షల ఎకరాలలో వరి సాగవుతుండగా, సుమారు 316,007 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతుల అవసరాలు పోను 2.40మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు వచ్చే అవకాశం ఉన్నందున కలెక్టర్ ఆధ్వర్యంలో దానికి తగ్గ ఏర్పాట్లను, ప్రణాళికను సిద్ధం చేశారు. జిల్లాలో 203 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తారు.

అధిక దిగుబడులు సాధించాలి

- కె.అనురాధ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలి. వర్షాలు సమృద్ధిగా పడటంతో పంటల సాగు గణనీయంగా పెరింగింది. వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు సాగవుతున్నాయి. ఈ దఫా రైతులు సన్న వరి సాగు బాగానే చేశారు. పంటల నమోదుతో దిగుబడులు, కొనుగోలు సమయంలో రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన



వర్ధన్నపేటలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్నరైతులు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 23 : తమకు రుణమాఫీ చేయడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఏదో ఒక కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తమను తిప్పుకొండటున్నారని సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ చాలా రోజులుగా రుణమాఫీ కోసం తాము బ్యాంకుకు వస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని, సాకులు చెబుతూ జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వర్ధన్నపేటకు చెందిన ఎనగందుల యాకయ్య అనే రైతు మాట్లాడుతూ తనకు, తన భార్యకు కలిపి నాలుగున్నర ఎకరాల భూమి ఉందని, ఒక్కొక్కరి పేరిట రూ.2లక్షల లోపే రుణం ఉందని, మొత్తం రూ.3,42,000 రుణం ఉండగా అవి మాఫీ కాలేదని, రెన్యువల్ కూడా చేయడం లేదని ఆరోపించారు. రుణమాఫీ అటుంచితే తన కూతురు వివాహం తర్వాత వచ్చిన కల్యాణలక్ష్మి చెక్కు తన భార్య అకౌంట్‌లో పడగా.. దానిని కూడా క్లియర్ చేయకుండా వారాల తరబడి తిప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా రైతులు ఆందోళన చేస్తున్న సమయంలోనే టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కాన్వాయ్ వరంగల్‌కు వెళ్తుండగా అడ్డుకున్నారు. దీంతో రవీందర్‌రావు కాన్వాయ్ వెనక్కు వెళ్లిపోయింది.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నాయకులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 23: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఐడీఏసీ నుంచి 50కార్లలో సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసేందుకు హైదరాబాద్ తరలివెళ్లారు. స్వర్ణజెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ.. కష్టకాలంలో కాంగ్రెస్ వెంట నడిచిన నిజమైన కాంగ్రెస్ నాయకులను గుర్తించి తగిన గౌరవం కల్పించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ త్తతరి లక్ష్మణ్, కరాటే ప్రభాకర్, జన్ను రవి, బస్వరాజు కుమారస్వామి, గోరంటాల రాజు, గుత్తికొండ నవీన్ పాల్గొన్నారు.



జెండా ఊపి కార్లర్యాలీని ప్రారంభిస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి - సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23: జెమిలీ ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం దీని ద్వారా ప్రజలకు ఏం లాభమో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఇంట్లో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరిపినా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరపడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకే కేంద్ర ప్రభుత్వం జెమిలీ ప్రతిపాదనలు తీసుకువస్తుందన్నారు. కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం అమానుషమన్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తమకు అభ్యంతరం లేదన్నారు. పేదల ఇండ్లను కూల్చివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రూ. 1400 కోట్లతో నిర్మిస్తున్న ఎల్కతుర్తి-రామాయణపేట హైవే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలన్నారు. ఈ నెల 26న హైవేపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అందరి రైతులకు అందడం లేదన్నారు. ఇటీవల వియత్నాం దేశ పర్యటనకు వెళ్లి వచ్చిన చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును సీపీఐ నాయకురాలు మంచాల రమాదేవి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, బీ సంపత్, అశోక్, స్టాలిన్, రమాదేవి, రామచంద్రారెడ్డి, తిరుపతి, ఆదరి రమేష్, మార్పు సంజీవరెడ్డి, గడ్డం రాజనర్సు, కృష్ణారెడ్డి, రొంటాల శ్యామ్, వేల్పుల చరణ్, రవితేజ, బీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

కేయూ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3,4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక అట్లాంటిక్ ఫెడరేషన్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. సదస్సులో ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ' మ్యాథమేటికల్ టెక్నిక్స్ ఇన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ (ఐసీఎంటీఈఏ-24) ఏ సోల్యూషన్ టూ పజి స్టోకాస్టిక్ లీనియర్ సిస్టమ్స్ యూజింగ్ ట్రయాంగులర్ అండ్ స్క్యూసిమెట్రిక్ స్ప్లిటింగ్ ఇంటరేటివ్ మెథడ్' అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ .మల్లారెడ్డి, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్లు భారవిశర్మ, సోమయ్య, తిరుమలదేవి అభినందించారు.

రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ. 60 కోట్ల నిధులు

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, పలు బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ ఎంఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 10కోట్లు, పంచాయతీరాజ్ సీఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 50కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలం మల్లారం ఎక్స్ రోడ్ నుంచి రసూల్‌పల్లిలో రూ. 86లక్షలతో బీటీ రోడ్, భీమదేవరపల్లి మండలంలోని అవల్దార్‌పల్లి ఆర్అండ్‌బీ రోడ్ నుంచి ఎర్రబెల్లి వరకు రూ. 37లక్షల బిటీ రోడ్, గట్లనర్సింగాపూర్, లంబాడితండ ఎక్స్ రోడ్ వరకు రూ. 374లక్షలు, ముల్కనూర్ ఎస్‌బీహెచ్ నుంచి కొత్తపల్లి ఎక్స్ రోడ్ వరకు రూ. 135లక్షలు, భీమదేవరపల్లి మండలం కొప్పూర్ ఎక్స్ రోడ్‌కు రూ. 117లక్షలు, మండలంలోని వంగర ఎర్రగడ్డ కల్వర్టు నిర్మాణం, బ్రిడ్జీ నిర్మాణానికి రూ. 80లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 100మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడాకారుల మధ్య నువ్వా నేనా అనే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ తత్వాన్ని ప్రదర్శించారు. బాలుర విభాగంలో జి. విద్యాధన్, ఎం. అభినవ్ రెడ్డి, అల్లాడి శ్రీవాత్సవ్, డి. జితేష్ బాలికల విభాగంలో జాన్సీ తోట, పి. లక్ష్మీశార్వాణి, కె. ఆరాధ్య, ఎం. హాస్య లు అత్యుత్తమ ప్రతిభతో రాణించి అక్టోబరు చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని కన్నా వెల్లడించారు. ఈ మేరకు విజేతులుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు, ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు ఎం.అబ్బయ్య సీసీఎస్ వరంగల్ నుంచి నర్మెట్ట, ఎం.సాయిరమణ నర్మెట్ట నుంచి దుగ్గొండి అలాగే ఎస్‌ఐలు చింత రాజు ఇంతజార్‌గంజ్ నుంచి కొడకండ్ల, ఎస్.రాజన్‌బాబు వరంగల్ ట్రాఫిక్ నుంచి జనగాంకు బదిలీ అయ్యారు.

ఫాంహౌస్ పాలన కాదు మాది ప్రజాపాలన

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వంగపహాడ్‌లో పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం



వంగపహాడ్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఫాంహౌస్ నుంచి మానిటరింగ్ చేసిన ప్రభుత్వం మాది కాదని ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన నిజమైన ప్రభుత్వం మాది అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్‌లో పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనం, గోదామును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా పని చేస్తున్నా కొందరు బీఆర్ఎస్ నాయకులు, ట్విట్టర్ వేదికగా కామెంట్స్ చేయడం సరైంది కాదని మండి పడ్డారు. గత ప్రభుత్వాలు రైతులకు రుణ మాఫీ చేయాలంటే అష్టకష్టాలు పడేవారని కాం గ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారే రూ. 2 లక్షల రుణ మాఫీ చేశాడని గుర్తు చేశారు. ఇంకా కొందరు రైతులకు రుణమాఫీ విషయంలో కొన్ని సాకేంతిక కారణాలు ఉన్నాయని త్వరలో పరిష్కారం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్‌లో ట్వి ట్టర్ టిల్లు, కౌశిక్‌రెడ్డి వంటి అటెన్షన్ డైవర్షన్ బ్యాచ్ పని చేస్తుందని గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదికగా దుర్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు.

టెక్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వంగపహాడ్ పీఏసీఎస్ ఏపీబీ బ్యాంకు నుంచి డీసీసీబీకి మార్చమని పాలక వర్గం సభ్యులు చాలా సార్లు కోరారని అతి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీ కానీ రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదని అందరికి న్యాయం జరుగుతుందన్నారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్, రైతు భరోసా ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పీఏసీఎస్ భవనం రూ. 30 లక్షలతో నిర్మాణం జరిగిందని చైర్మన్ మేరుగు రాజేశ్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నీరజ, డీసీసీబీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్లు రుద్రారపు రాజు, మేరుగు రేణుక, గండు అశోక్ యాదవ్, పావం జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ టాప్ శాస్త్రవేత్తలలో

వరంగల్ ప్రొఫెసర్‌కు చోటు



డాక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23: ప్రపంచ టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ ఇన్‌చార్జి విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు చోటు దక్కింది. ఇటీవల స్టాన్ ఫర్డ్, కాలిఫోర్నియా, ఎన్సివియర్ విశ్వవిద్యాలయాలు కలిసి ప్రపంచంలోని టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాను రూపొందించాయి. ఈ జాబితాలో డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు స్థానం దక్కింది. 2021-2023 కొనసాగే ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించారు. న్యూరో సర్జరీ, న్యూరో శాస్త్రంపై అనేక పరిశోధనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా నిలిచారు. అమెరికాలోని నాసా, ఏమోరి యూనివర్సిటీ, జార్జియా టెక్ యూనివర్సిటీ, టెక్సాస్ విశ్వవిద్యాలయం లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేశారు. డాక్టర్ రమేశ్ 100కు పైగా పరిశోధన పత్రాలను, అల్జీమర్స్, స్క్రిజోఫినియా, ఆంటి వ్యాధులపై ప్రచురించారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌ను పలువురు ఐఎంఏ వైద్యులు ప్రశంసించారు.

కొనసాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 : కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్సవం ఉత్కర్ష 24 కార్యక్రమం మూడవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. సోమవారం ఇంపల్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సైక్లింగ్, పరుగెత్తడం, జంపింగ్, క్లైంబింగ్, ఇతర క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్లు చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్నారు. సాయంత్రం విద్యార్థులు చిత్రలహరి (షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్) ఇందులో మెడికల్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కాకతీయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక దంపతుల కూతురుకు ఉత్కర్ష అనే పేరు పెట్టారు. కేఎంసీలో మాకు చాలా నేర్పిందని, కాలేజీ మీద ఉన్న ప్రేమతో తమ కూతురికి ఉత్కర్ష అనే పేరును పెట్టినట్లు వారు తెలిపారు. మంగళవారం విద్యార్థులు మెగా రక్తదాన శిబిరం, సాయంత్రం కార్నివల్ నైట్ నిర్వహించనున్నారు.

పలు రైళ్లు ఆలస్యం

కాజీపేట, సెప్టెంబరు 23 : కాజీపేట టౌన్ - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య ఎఫ్ క్యాబిన్ వద్ద సోమవారం మూడో లైన్ బైపాస్ పనులు చేపట్టారు. రైల్వే అధికారులు పర్యవేక్షణలో 400 మంది గ్యాంగ్‌మెన్‌లు ఒక యూనిట్‌గా ఏర్పడి లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టారు. నాలుగు గంటలు బ్లాక్ తీసుకుని ఈ పనులు చేపట్టడంతో కాజీపేట, బల్లార్షా, వరంగల్ రైల్వే స్టేషన్ల మార్గంలోని పలు రైళ్లు అలస్యంగా నడిచాయి. పనుల అనంతరం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ పనులు డిప్యూటీ సీఈ భార్గవ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భటియా, టీఐ అగ్గి రవీందర్, పీడబ్ల్యూ గోపిల పర్యవేక్షణలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

'నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ప్రయోజనాలు'

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు ఎన్నో ప్రయో జనాలు ఉన్నాయని ఏపీ రాజమండ్రి ఆదికవి నన్నయ్య వర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఉద యభాస్కర్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అధ్యక్షతన నేషనల్ పెన్షన్ స్కీంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ. ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఎన్‌పీఎస్‌లోకి మారాలని ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం అడిట్ అభ్యంతరాలను వ్యక్తం చేస్తోందని సూచించారు. 80 సీడీసీ కింద ఐటీ కోసం ఎన్‌పీఎస్ అవసరం ఉంటుందని చెప్పారు. అనంతరం వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారులు తమను ఎన్‌పీఎస్‌లోకి మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కామర్స్ విభాగం ప్రొఫెసర్ రాజేందర్ నలుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ సదస్సులో వర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'రామప్ప' భద్రత.. గాలిలో దీపమేనా?

- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23 : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రక్షణ కరువైంది. పర్యాటకంగా ప్రపంచ పటంలో ఉన్నత స్థానం పొందినా స్థానికంగా మాత్రం ఈ వారసత్వ సంపదకు రక్షణ కరువైంది. ఇక ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న 20 ఉప ఆలయాల భద్రత గాలిలో దీపంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి రామప్పను అభివృద్ధి చేస్తున్నా రక్షణ కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. తాజాగా గొల్లాలగుడి తవ్వకాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న రామలింగేశ్వరుడి రక్షణపై భక్తుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

వీవీఐపీలు వచ్చినప్పుడే రక్షణ

సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి 2022 జూలైలో యునెస్కో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావడం కోసం కేంద్ర పురావస్తుశాఖ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాయి. గుర్తింపు తీసుకొచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. గుర్తింపు వచ్చాక రాష్ట్రపతి మొదలు అనేక మంది వీవీఐపీలు రామప్పను సందర్శించిన సమయంలో మాత్రమే పోలీసులు రక్షణగా వస్తున్నారు. ఆ తరువాత మళ్లీ యథావిధిగా రామలింగేశ్వరుడికి రక్షణ కరువవుతోంది.

ఉప ఆలయాలనూ గాలికొదిలేశారు..

రామప్ప ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలు, ప్రధాన ఆలయాలు చుట్టుపక్కల ఉన్నాయి. వాటి రక్షణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఫలితంగా గొల్లాలగుడిలో గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు చేపట్టారు. ఏకంగా 1000కిలోల బరువు ఉన్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని పైకప్పు కిందికి తోశారు. కిందకు తోశాక ప్రాకారం పైభాగంలో పుష్పాకారంలో ఉన్న టంకాన్ని పగులగొట్టారు. ఇదంతా ఒకరిద్దరు కలిసి చేసిన పనికాదని జరిగిన ఘటనను పరిశీలిస్తే తెలుస్తోంది. స్థానికుల సహకారం ఉంటే తప్ప ఇంత బరువును కిందికి తోయలేరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం కనుక ఈఘటనను సిబ్బంది చూసి ఉండకపోతే దుండగులు మరికొన్ని ఉప ఆలయాలపై కూడా ఇదే తరహాలో దాడులకు పాల్పడి ఉండేవారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులు చేస్తున్నా సీసీ కెమెరాలు కరువు

యునెస్కో గుర్తింపు పొందిన అనంతరం రామప్ప పరిసర ప్రాంగణంలో రూ.కోట్లు వెచ్చించి చేస్తున్న పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అటు కాంట్రాక్టర్లు కానీ, ఇటు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులకు ఏదైనా ఇబ్బంది ఏర్పడితే కనీసం గుర్తించేందుకు సీసీ కెమెరా లు కూడా లేవు. పైగా ఆలయం వద్ద ఇలాంటి సెక్యూరిటీని కూడా నియమించకపోవడం పట్ల సర్వత్రా వి మర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు వచ్చినా ఇంకా అభద్రతలోనే రామప్ప ఆలయం ఉంద ని స్థానికులు వాపోతున్నారు.

టంఖంలో వజ్రాలు ఉన్నాయనే..

రామప్ప ఆలయానికి సమీపంలోని గొల్లాలగుడిలో రెండురోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరి గినట్టు వెలుగులోకి వచ్చిన క్రమంలో ఆలయం పై భాగంలో ఉన్న పుష్పాకారపు పైకప్పు భాగంలో ఉన్న టంఖాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఆటంఖంలో వజ్ర, వైఢూర్యాలు ఉన్నాయనే ఆశతో కొందరు వ్యక్తు లు దానిని పగులగొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పైభాగం నుంచి కిందికి తీసుకురావడానికి సుమారు 10మంది ప్రయత్నంచేస్తే తప్ప ఆ ప్రకారం కిందికి వచ్చే అవకాశంలేదని స్థానికులు భావిస్తున్నారు.

20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే


రామప్ప దేవాలయం ఆవరణలోని గొల్లాలగుడి


దీపశిఖలతో చెక్కిన టంఖం

రామప్ప గుడులకు రక్షణ కల్పించాలి

ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్



రామప్ప ప్రధాన ఆలయం తోపాటు దాని పరిధిలో ఉన్న గుడులను వెలికితీసి వాటికి ర క్షణ కవచాలను ఏర్పాటు చేసి ఆలయాలకు భద్రత కల్పించా లి. గొల్లాలగుడి పైకప్పు దీప శిఖలో అనేక కళాకృతులు చెక్కి ఉండేవి. అలాంటి అనేక కళాకృతులు మరుగునపడి ఉన్నాయి. వాటి ని నియంత్రిత రక్షణ వ్యవస్థ పరిధిలో ఉంచాలి. అలాగే పురావస్తుశాఖ రక్షణ, నిర్వహణ సిబ్బంది ని పెంచాలి.

ప్రధాన ఆలయంపై కన్నేస్తే ఇక అంతే..

రామప్ప ప్రధాన ఆలయం పరిధుల్లో దుండగులు ఎలాంటి తవ్వకాలు చేపట్టినా అంతర్జాతీయ పర్యాటక సమాజం ముందు తలదించుకోవాల్సి వస్తుంది. కనీస స్థాయి భద్రత కల్పించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో ఉన్న త స్థానం సంపాదించిన రామప్పకు ఇప్పటికైనా రక్షణ కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

గొల్లాలగుడిని సందర్శించిన కలెక్టర్ దివాకర

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు, గొల్లాల గుడిని సోమవారం ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఏరియా మ్యాపింగ్ సర్వేచేసి బౌండ్రీ పిల్లర్ ఫిక్స్ చేయాలన్నారు. కెనాల్‌కు సంబంధించిన ఏరియా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన రామప్ప ఉప ఆలయాల్లో ఒకటైన గొల్లాలగుడిని సందర్శించి గుడి పైకప్పు, దెబ్బతిన్న శిఖరం, పైకప్పులో వికసించే తామరపువ్వు గుర్తుతో ఉండి పూర్తిగా ధ్వంసమైన శిల్పాన్ని పరిశీలించారు. దేవాలయం పూర్తి వివరాలను పురావస్తు శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దేవాలయంలో ధ్వంసమైన శిల్పం, పువ్వు, అన్ని డాక్యుమెంట్ చేయాలని, రాత్రి కాపలాదారుడిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారి మల్లేశం, ఇరిగేషన్ డీఈ రవీందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


ధ్వంసమైన శిల్పాలను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర


ప్రాజెక్టు పనుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చిన్న కాళేశ్వరంపై చిగురిస్తున్న ఆశలు

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలకు సాగునీరు అందించేందుకు గాను చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. సుమారుగా 45వేల ఎకరాల పంట భూములకు నీరందించేందుకు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపి చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 70వేల ఎకరాల భూ సేకరణకు రూ.14 కోట్లు, వీరసాగర్‌లో సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాకు రూ.31.39 కోట్ల నిధులు మంజూరైనట్లు ఈఈ యాదగిరి తెలిపారు. ప్రస్తుతం ఈఈ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నేడు కాళేశ్వరానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాక

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులు మంగళవారం రానున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధానంలో సరస్వతి పుష్కరాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సరస్వతి పుష్కరాల సమావేశాలు నిర్వహించడానికి ముందస్తుగా కాళేశ్వరంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అలాగే రూ.25 కోట్లతో 8ఏళ్ల క్రితం మంజూరైన పనులపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది.

30న విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ నెల 30న పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో విజేతలైన విద్యార్థులు దక్షిణ భారత స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలైన విద్యార్థులు జనవరి 2025లో బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆమె సూచించారు.

బోగస్ పాలనతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారు

- ప్రజల అభిప్రాయాలను పట్టించుకోలేదు
- ఇప్పటి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- కేయూ సింపోజియంలో సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న హరగోపాల్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కేసీఆర్ పాలనంతా బోగస్‌గా సాగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్ అధ్యక్షతన 'డికెడెల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ ఇష్యూస్ చాలెంజేస్' అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలందరూ ఉద్యమం చేసి ఆశించిన డెమొక్రటిక్ పాలిటిక్స్‌కు బదులుగా విరుద్ధమైన పాలన సాగించారని విశ్లేషించారు. బీఆర్ఎస్ పాలన నిర్బంధం, నిరంకుశత్వంతో పాలన సాగిందన్నారు. కేసీఆర్ పాలనలో అక్రమంగా 221 కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ వర్సిటీలకు భారీగా నిధుల్లో కోత విధించిందని, వర్సిటీ స్వయం ప్రతిపత్తిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పట్లో అధికారం చేపట్టగానే తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, వలసలతో పాటు అస్తిత్వం కోల్పోయిన యువత ఆకాంక్షలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే తమది పక్క రాజకీయ పార్టీ అంటూ రాష్ట్రం కోసం పోరాడిన మేధావులు, యువత, విద్యావేత్తల ఆలోచనలు పట్టించుకోలేదని అన్నారు. ఖరీఫ్‌లో రైతుల పేరుతో నమోదైన భూములను ధరణి పోర్టల్‌లో సాయంత్రం పని ప్రారంభించి రాత్రికి తమకు అనుకూలమైన పేర్లకు మార్చేవారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని మిగతా నీటి ప్రాజెక్టుల్లో అవకతవకలు, అవినీతి జరిగిందన్నారు. కేసీఆర్ తన హయంలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ధ్వజమెత్తారు. సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డీ.నరసింహారెడ్డి కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే అంటూ ప్రగల్భాలు పలికినప్పటికీ తీర రాష్ట్రం సిద్ధించిన తర్వాత వాటిని మరిచారని అన్నారు. తమిళనాడుతో పోలిస్తే తెలంగాణలో విద్య ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. అర్థశాస్త్రంలో దత్తాంశాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీతో పాటు నిధుల కొరత ఉందన్నారు. పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి హైదరాబాద్‌లో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రమంతా విస్తరించాలని చెప్పారు.

కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి, సమస్యలు, సవాళ్ళకు సరైన మార్గదర్శనంగా సింపో జియం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్ననా యక్, ప్రొఫెసర్ సీహెచ్. సమ్మయ్య కృష్ణమాచారి, పరిశోధకులు జి.రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి త్వరలో నోటిఫికేషన్?

- సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీసీ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కాకతీయ యూనివర్సిటీలో ఏడేళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకుల నియామక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, వర్సిటీలో విద్యార్థులకు బోధన సక్రమంగా జరగకపోవడం, విద్యార్థులు పడుతున్న పలు ఇబ్బందులను వివరిస్తూ 'పాఠాలు చెప్పే వారేరీ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి.. సమస్య గురించి రాష్ట్ర ఉన్నతా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు తమకు వీసీ నుంచి సమాచారం అందిందని వర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌లు, పార్టుటైం ఆశావాహులు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని తాము రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లామని, వర్సిటీలో ఉన్న పరిస్థితులను విన్నవించామని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందించి.. పార్టుటైం నోటిఫికేషన్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీలైనంత త్వరగా ఉన్నతాధికారుల అనుమతిలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదిలా ఉండగా సోమవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగిన అర్థశాస్త్ర విభాగం సింపోజియంలో వర్సిటీల్లో పార్టుటైం నియామకాల్లేవనే అంశాన్ని పలువురు మాట్లాడారు. వర్సిటీలో అధ్యాపక నియామలు చేపట్టకపోవడంతో ఒక తరానికి నష్టం చేసినట్లేనని ఆందోళన వ్యక్తం చేశారు.

స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం..

సోమవారం వర్సిటీకి వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన పీహెచ్‌డీ డాక్టరేట్లు, ఆశవహులు 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని చూపించారు. సమస్యలను విని స్పందించిన కోదండరాం వెంటనే వర్సిటీ క్యాంపస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో చర్చించారు. పార్ట్‌టైం నోటిఫికేషన్ విడుదలకు ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణల దృష్టికి తీసుకెళ్లి పార్టుటైం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. దాంతో తాము ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలపై దృష్టి సారించామని.. వీలైనంత త్వరగా ఇస్తామని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ వర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌లు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందచేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.


కోదండరాంకు వినతి పత్రాన్ని ఇస్తున్న వర్సిటీ డాక్టరేట్ అభ్యర్థులు

27న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్, హనుమకొండలోని అపోలో ఫార్మసీ కేంద్రాల్లో ఫార్మసిస్ట్/అసిస్టెంట్/అప్రెంటిషిప్‌గా పనిచేసేందుకు 50 ఖాళీలకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు గల డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు వారి జీరాక్స్ సర్టిఫికేట్లతో ఈ నెల 27న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి విరాలకు 78933 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు-రూ.లలో)

పంట	గరిష్టం	కనిష్టం
మక్కలు (బిల్టీరకం)	2,660	2,405
పల్లికాయ (సూక)	5,600	4,500
పల్లికాయ (పచ్చిది)	4,400	3,800
కందులు	8,059	7,575
పెసళ్లు	7,652	4,052
పత్తి	7,650	5,500
కొత్తపత్తి	7,225	6,500
పసుపు (కాడి)	13,130	12,000
పసుపు (గోల)	12,455	10,800
తేజ మిర్చి	12,500	10,000
తేజ ఏసీ	18,800	14,000
వండర్‌హాట్ ఏసీ	15,000	13,000
యూఎస్341 ఏసీ	16,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

\- వరంగల్ వ్యవసాయం

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో శివాత్మికకు బంగారు పతకం


శివాత్మికను విజేతంగా ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు

హనుమకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండకు చెందిన సిహెచ్ శివాత్మిక అండర్ 17 (42 కేజీ) విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 650మంది పోటీ పడ్డారు. వీరందరిని దాటుకొని విజేతగా నిలిచిన హనుమకొండ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన శివాత్మిక నవంబర్ నెలలో ఉత్తరాఖండ్‌లో జరుగబోయే జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాల్గొనేందు కు ఎంపికయ్యారు. బంగారు పతకం సాధించిన శివాత్మికను తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.ఆంజనేయులు, వైస్‌ప్రెసిడెంట్ బండారి సంతోష్, కోచ్‌లు రామ్‌చందర్, సాగర్, కర్ర వెంకటేశ్, సిహెచ్ కరుణాకర్, సీహెచ్ సుప్రియ, పి దినేష్, ఏ గణేష్, యూ రణదీప్, జి వైష్ణవి అభినందించారు.

చిలుపూర్‌లో పట్టపగలు దొంగతనం

- హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు
- ఓ ఇంట్లో చొరబడి మూడు తులాల గొలుసు చోరీ

చిలుపూర్, సెప్టెంబరు 23 : పట్టపగలు హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఆగంతకుల్లో ఒకరు ఓ ఇంట్లోకి ప్రవేశించి, ఒంటరిగా ఉన్న మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల గొలుసుకును లాక్కెళ్లాడు. అనంతరం బైక్‌పై ఇద్దరూ పారిపోయారు. ఈ ఘటన చిలుపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత మహిళ జంగిటి రాధిక -లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక తన భర్త వివిధ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్లడంతో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంట్లో కూర్చుని టీవీ చూస్తోంది. ఈ లోగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంటి ముందు ఆగారు. ఒకరు బైక్ దగ్గర ఉండగా, మరొక వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. వచ్చీరాగానే కత్తితో పొడిచి చంపుతానని మెడలో ఉన్న బంగారం ఇవ్వాలని బెదిరించాడు. అతడిని ప్రతిఘటించే ప్రయత్నం చేసిన ప్రయత్నం ఫలించకపోగా, ఆమె మెడలో ఉన్న మూడు తులాల (రూ.2.50 లక్షల విలువ గల) బంగారు గొలుసును లాక్కెళ్లి పారిపోయారు. బాధిత మహిళ రాధిక -లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చిలుపూర్‌లో దొంగతనం జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు మామునూరు నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ బి. పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://navodaya.gov.in అనే వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

శ్రీపతిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ. 2.15 లక్షల నగదు, 10 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరణ

చిలుపూర్, సెప్టెంబరు 23 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 2.15లక్షల నగదుతో పాటు, 10తులాల బంగారం, 5 తులాల వెండి ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మూడికె లక్ష్మికి భర్త కొన్నేళ్ళ క్రితం చనిపోగా, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకును చూడడం కోసం ఐదు రోజుల క్రితం లక్ష్మి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి సొత్తును దోచు కెళ్ళారు. సోమవారం ఉదయం ఇంటికి వెసిన తాళం పగులగొట్టడాన్ని గమనించిన సమీప బంధువులు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీంతో సమీప గ్రామంలో లక్ష్మి కుమార్తె హారిక గ్రామానికి చేరుకుంది. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. సమాచారమందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి చిలుపూర్, శ్రీపతిపల్లి గ్రామాలకు చేరుకున్నారు. దొంగతనాలు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. దొంగలను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

'పద్మావతి' హాల్టింగ్ అయోమయం

- నెక్కొండలో డౌన్‌కు ఓకే.. అప్‌కు నో...
- ప్రైవేట్ యాప్‌లలో తప్పుడు సమాచారంతో ప్రయాణికుల ఇబ్బందులు


ఓ యాప్‌లో నెక్కొండలో హాల్టింగ్ చూపుతున్న దృశ్యం

నెక్కొండ, సెప్టెంబరు 23 : సికింద్రాబాద్-తిరుపతి (12764 / 12763) పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ విషయంలో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండగా.. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైళ్లకు హాల్టింగ్ లేదు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు అప్ హాల్టింగ్ ఇప్పించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌ను కోరారు. దాంతో మూడు నెలలుగా నెక్కొండ స్టేషన్‌లో అప్ హాల్టింగ్ ఇప్పించారు. కానీ అది మున్నాళ్ల ముచ్చటే అయింది. ఈనెల 15 నుంచి అప్ హాల్టింగ్‌ను రద్దుచేశారు. కానీ ప్రైవేట్ యాప్‌ల్లో మాత్రం నెక్కొండలో పద్మావతి అప్ హాల్టింగ్ చూపుతుండడంతో తికమకపడుతున్నారు. ఇక తిరుపతి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల మంది వెళ్తుంటారు. నెక్కొండ స్టేషన్‌లో రైలు ఎక్కి తిరుపతి వెళ్లి.. తిరుగుప్రయాణంలో అదే రైల్లో నెక్కొండకు రావాలని భావిస్తున్నారు. కానీ ఈ స్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో వరంగల్‌లో దిగాల్సి వస్తోంది. కొన్ని ప్రైవేట్ యాప్(ఆన్‌లైన్)లో నెక్కొండ స్టేషన్‌లో అప్ పద్మావతి హాల్టింగ్ చూపించడంతో ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఉత్సవాలకు భద్రకాళి ఆలయం ముస్తాబు



వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 23: మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న భద్రకాళి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లలో భాగంగా భద్రకాళి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో చ లువ పందిళ్లు, క్యూలైన్లను సోమవారం ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనంతోపాటు ప్రతీ రోజు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనాలు, పురాణాలు కొనసాగుతాయని ఉత్సవాల నిమిత్తం పందిళ్లు వేసే కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు.



ప్రైవేటు టీచర్లకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రైవేటు టీచర్లకు అవార్డులు భేష్

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

కరీమాబాద్, సెప్టెంబరు 23: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడం అభినందనీయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వడుప్సా (ట్రస్మా) వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఉర్సుగుట్ట వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జిల్లాలోని 150 పాఠశాలలకు చెందిన 300మంది ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రం, మెమెంటో, శాలువాతో సత్కరించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యతోపాటు ఉపాధి కల్పించే శిక్షణలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు ఎస్.మధుసూదన్, వడుప్సా జిల్లా అధ్యక్షుడు సీహెచ్.నాగార్జున రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గుట్టపైకి రోడ్డు మార్గం ఏర్పాటుకు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్

గిర్మాజీపేట,సెప్టెంబరు 23: గోవిందరాజుల గుట్టపై రోడ్డు మార్గం ఏర్పాటును సోమవారం కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్‌తో కలిసి దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, అసిస్టెంట్ కమిషనర్ సునీతలు పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన డీపీఆర్ తయారు చేయాలంటూ మంత్రి సురేఖ ఆదేశాల మేరకు అధికారులు సందర్శించారు. మున్సిపల్ మంచినీటి రిజర్వాయర్ స్థలం ప్రాంగణం మీదుగా గుట్టపైకి రోడ్డు నిర్మాణంను పరిశీలించారు. మెట్ల మార్గంలోని కాలభైరవ దేవాలయం వద్ద నుంచి రూ.70లక్షలతో లిఫ్ ఏర్పాటును కూడా పరిశీలించారు. కార్యక్రమంలో చింతాకుల సునీల్ కుమార్, ప్రేమ్‌సాగర్, శివ, మహేష్, సాగర్, సురేష్ పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ నిజమే..

● మునిసిపాలిటీ కమిషనర్ జోనా ● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 23: ఆంధ్రజ్యోతి వరుస కథనాలకు మునిసిపాలిటీ అధికారులు స్పందించారు. రూ.6 కోట్ల అక్రమాలు అనే శీర్షికతో వచ్చిన కథనంపై మునిసిపాలిటీ కమిషనర్ జోనా స్పందించారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 13న విజిలెన్స్ అధికారులు 2018-23వరకు చెల్లింపుల బిల్లులు మునిసిపాలిటీ కార్యాలయం నుంచి సమర్పించాలని కోరినట్లు నిర్ధారించారు. సంబంధిత పూర్తి వివరాలు త్వరలోనే విజిలెన్స్ అధికారులకు అందచేయనున్నట్లు స్పష్టం చేశారు. 2024 మార్చి మాసంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.25 లక్షలు మునిసిపాలిటీ జమయ్యాయని, వాటి నుంచి రూ.22 లక్షలు బిల్లులు సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించినట్లు తెలిపారు. సాధారణ నిధులు, ఇతర విధాలుగా రావాల్సిన నిధులు లేని కారణంగా కౌన్సిలర్లు చేసిన పనులకు, వారి గౌరవ వేతనాలు చెల్లించలేకపోతున్నామని స్పష్టం చేశారు. దీని కారణంగానే కొంత మంది కౌన్సిలర్లు దుష్ప్రచారం చేస్తూ, అధికారులను, కిందిస్థాయి సిబ్బందిని వ్యక్తిగతంగా వేధిస్తున్నారని వివరించారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై స్పందించండి

కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి ఫిర్యాదుదారులకు సరియైన సమయంలో సత్వరమే న్యాయం చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వెంటనే అక్కడి ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 79ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ట్యాక్సీల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, డీసీపీ ప్రసన్నరాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 23, హెల్త్, శానిటేషన్ -6, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 5, టౌన్‌ప్లానింగ్ - 43, ఎలక్ట్రికల్ - 2 మొత్తం 79 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

బాధితుల ఫిర్యాదులు ఇలా..

- చర్చీ ముందు మురుగు కాల్వ నీరు వదిలేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని ఏనుమాముల సుందరయ్యనగర్‌కు చెందిన తెలుగు బాప్టిస్ట్ చర్చీ సంఘం సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ హనుమాన్‌నగర్ రోడ్డు నెంబర్ -2లో ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే వదిలి వేశారు. భారీ వాహనాలు కచ్చా రోడ్డుపై ప్రయాణించడంతో మంచి నీటి పైప్ లైన్ ధ్వంసమై డ్రైనేజీ నీరు మంచి నీటిలో కలుస్తుందని హనుమాన్‌నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ వికాస్‌నగర్ కాలనీలో ఓ ఇంటిపై సెల్ టవర్ నిర్మాణాలు జరుగుతున్నాయని, టవర్‌ను నిలిపివేయాలని ఎస్‌జీవీఎస్ కాలనీ కమిటీ నాయకులు ఫిర్యాదు చేశారు.
- భద్రకాళి బండ్‌ను వీక్షించేందుకు వచ్చిన వారు తమ ఇండ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో చాలా ఇబ్బందిగా ఉందని హంటర్ రోడ్డు దుర్గాకాలనీ రోడ్డు నెంబర్ -2 కాలనీకి వారు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ 47వ డివిజన్ భవానినగర్‌లో చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, బల్దియా అధికారులు వెంటనే స్పందించి అభివృద్ధి చేయాలని డివిజన్ కార్పొరేటర్ సుంకు నర్సింగరావు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

కరీమాబాద్, సెప్టెంబరు 23: నగరంలోని ఉర్సుగుట్ట వద్ద ప్రతీ సంవత్సరం నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఈసారి కూడా వైభవంగా నిర్వహిస్తామని దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు అన్నారు. సోమవారం కరీమాబాద్‌లోని ఆదర్శ ట్రస్ట్ భవన్‌లో ఉత్సవ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సంజయ్‌బాబు మాట్లాడుతూ గత సంవత్సరం కోడ్ కారణంగా ప్రభుత్వం తరఫున ఎలాంటి ఏర్పాట్లు చేయకున్నా, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు సహకారంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో దసరా ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్న గౌడ్, సహాయ కోశాధికారి వెలిదే శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపూరి రంజిత్‌గౌడ్, పొగాకు సందీప్, సహాయ కార్యదర్శులు నాగపూరి మహేష్, కత్తెరశాల వేణు, వొడ్నాల శ్రీను, నరిగే శ్రీను, సభ్యులు బిట్ల క్రాంతి, గట్టు రమేష్, బత్తిని రవీచందర్, నాగపూరి నాగరాజు, అక్తర్, పూజారి విజయ్, పార్వతి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సంజయ్‌బాబు



ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేస్తున్న మేయర్ సుధారాణి, అధికారులు

ఫిల్టర్‌బెడ్ పరిశీలించిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్‌ను నగర మేయర్ గుండు సుధారాణి సోమవారం తనిఖీ చేశారు. ఫిల్టర్‌బెడ్‌లో పనిచేస్తున్న సిబ్బంది హాజరు పట్టికతోపాటు రిజిస్టర్‌లను పరిశీలించారు. వాటర్ మానిటరింగ్ సెల్, హెయిల్ బ్లోయింగ్, ఫిల్టర్ మీడియా, సంప్, సంప్ హౌస్‌లను పరిశీలించి అక్కడ పని చేస్తున్న వారికి తగు సూచనలు చేశారు. ధర్మసాగర్ నుంచి ఫిల్టర్‌బెడ్‌క్ వచ్చే రా వాటర్, ఫిల్టర్ బెడ్‌లోని నీటి శుద్ధి ప్రక్రియ, క్లోరినేషన్ చేసిన తర్వాత ప్రజలకు సరఫరా అయ్యే నీటి నాణ్యతను పరిశీలించారు. ముఖ్యంగా రైల్వేగేటు ప్రాంతంలో పలు కాలనీలకు నీటి సరఫరా సరిగా అందడం లేదని ఫిర్యాదులు వచ్చాయని ప్రజల సమస్యను త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, రాజ్‌కుమార్, ఏఈలు కృష్ణమూర్తి, హరికుమార్, ముజామిల్, హబీబుద్దీన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 23: భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించే ప్రతిపాదనను విరమించుకోవాలని తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేకల మొగిలి, గజ్జ చందు, యాకూబ్‌పాషా, జక్కుల మల్లేశ్, అశోక్, రాజు, లక్ష్మి, గట్టమ్మ, సరిత, పూలమ్మ, వీరస్వామి, లత పాల్గొన్నారు.

నర్సరీలు నిబంధనలు పాటించాలి

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 23: మిరప, కూర గాయల నారు పంపిణీ చేసే నర్సరీలు నిబంధనలు పాటించాలని జాయింట్ డైరెక్టర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మిరప, కూరగాయలు తదితర సుగంధ ద్రవ్యాల పంటలకు విత్తనాలకు బదులు నారు మొక్కలను స్థానిక నర్సరీల్లో రైతులు కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం కల్తీనారును అరికట్టేందుకు ఆరోగ్యకరమైన నారును అందుబాటులోకి తెస్తోందని పేర్కొన్నారు. జిల్లాలోని నర్సరీలను ఉద్యానవన శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొని చట్టప్రకారం పెంచాలని తెలిపారు. లైసెన్సు లేకుండా నారు క్రయవిక్రయాలు జరిపితే పీడీ యాక్ట్, రూ.50వేల జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. మండలాల వారీగా ఉద్యానశాఖ అధికారుల నియమించడం జరిగిందని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి వరంగల్ ఎన్.తిరుపతి సెల్‌నంబర్ 89777 14060 (వరంగల్, ఖిలావరంగల్, గీసుగొండ, సంగెం మం డలాలు) ఎన్.తిరుపతి ఇన్‌చార్జి వర్ధన్నపేట సెల్‌నంబర్ 89777 14062 (వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండ లాలు)లో సంప్రదించాలని కోరారు.

సీకేఎంకు డిప్యూటేషన్‌పై రేడియాలజిస్ట్

గిర్మాజీపేట, సెప్టెంబరు 23 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రెండు నెలల తర్వాత రేడియాలజిస్ట్‌ను డిప్యూటేషన్‌పై నియమించారు. స్కానింగ్ జరగక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. రేడియాలజీ విభాగం నుంచి బదిలీ అయిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ (రేడియాలజీ డిప్లొమా) డాక్టర్ వనజను కలెక్టర్ డిప్యూటేషన్‌పై తిరిగి సీకేఎం ఆస్పత్రికి శనివారం నియమించారు. జూలైలో జరిగిన బదిలీలలో డాక్టర్ వనజ రాయపర్తి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా, డాక్టర్ రాంబాబు హనుమకొండ జిల్లా కమాలాపూర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. వీరి బదిలీ తర్వాత స్కానింగ్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. సమస్యను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల కలెక్టర్ సత్యశారద దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ వనజ, రాంబాబులను డిప్యూటేషన్‌పై రావాలంటూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వారి రాకతో స్కానింగ్ సమస్యలు తీరినట్టయింది.

14న ప్రతిభావంతులకు పురస్కారాలు

ఖిలావరంగల్, సెప్టెంబరు 23: పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను వచ్చేనెల 14న వరంగల్‌లో నిర్వహించనున్నట్లు పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(పోపా) రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం శివనగర్‌లోని వందన హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ ఆడెపు శ్యామ్ అధ్యక్షతన ఆహ్వానపత్రిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలి విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, నీట్, ఈఏపీసెట్, ఏఐ(ఈఈఈ), ఐఐటీ, వివిధ రంగాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు మొబైల్ నం.939 0122559 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, ప్రధాన కార్యదర్శి పాము శ్రీనివాస్, రాష్ట్ర ప్రతినిధులు గోషికొండ సుధాకర్, ధర్మపురి రాజగోవిందు, అశోక్ కుమార్, సుభాష్, పెద్దన్న పాల్గొన్నారు.

'మార్కెట్లో బైలాను అమలు చేయాలి'



కార్యదర్శికి మెమోరాండం సమర్పిస్తున్న ఏఐకేఎఫ్ బృందం

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతులు దోడిపీకి గురి కాకుండా బైలాను తప్పనిసరిగా అమలు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకేఎఫ్ జిల్లా ప్రతినిధుల బృందం ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మలను కలిసి మార్కెట్లో నెలకొన్న సమస్యలపై మెమోరాండం సమర్పించారు. రమేష్ మాట్లాడుతూ.. మార్కెట్లో బైలాను అమలు చేయాలని, రైతుల వద్ద అధిక కమీషన్ వసూలు చేసే కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హంసరెడ్డి, జి.కుమారస్వామి, ఎన్.ప్రతాప్, జగదీశ్వర్, ఇస్మాయిల్, నగేష్ పాల్గొన్నారు.

'వారిపై చర్యలు తీసుకోవాలి'

ఆటోనగర్, సెప్టెంబరు 23: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు పాల్పడే వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి.అయూబ్, మీసాల ప్రకాష్‌లు కోరారు. ఎల్బీనగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా డబ్బు సంపాదించి కాంగ్రెస్‌లో చేరి అదే ధోరణి అనుసరిస్తూ కొండా దంపతుల రాజకీయ అభివృద్ధిని భ్రష్టు పట్టించేలా వారి ఆగడాలను అరికడతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, ఎం.సునీత, మండపల్లి కృష్ణ, ఎండి.అక్తర్, కూచన రవీందర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఖిలావరంగల్, సెప్టెంబరు 23:పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం శివనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో మణికంఠరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూని యూనివర్సిటీలు సమస్యల నిలయంగా మారాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి దిడ్డి పార్థసారధి, ల్యాదళ్ళ శరత్, నాయకులు అంజి, శివకుమార్, అభిరామ్, సాగర్, మహేష్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌నగర్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

వరంగల్‌సిటీ, సెప్టెంబరు 23: ఏనుమాముల ఎన్‌టీఆర్‌నగర్‌లో సోమవారం కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు ఇంతియాజ్, మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ అడుప మహేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈర్ల రాజేందర్, ఉపాధ్యక్షులు ఆరూర్ కుమార్, ఉర్సు అంజయ్య ప్రధాన కార్యదర్శి పిట్ట నగేష్, కోశాధికారి ల్యాగల భిక్షపతి, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సైజాజి, ప్రధాన కార్యదర్శి ఏలేంద్ర, కోశాధికారి రేవతి, యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కస్తూరి భరత్, ప్రధాన కార్యదర్శి కిరణ్, సహాయ కార్యదర్శిగా పిట్ట సుధీర్ ఎన్నికయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు నేషన్ బిల్డర్ అవార్డ్స్

కరీమాబాద్, సెప్టెంబరు 23: రోటరీక్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి నేషన్ బిల్డర్ అవార్డ్స్‌తో సత్కరించారు. సోమవారం ఫోర్ట్‌రోడ్ రోటరీక్లబ్‌లో క్లబ్ ప్రెసిడెంట్ కురువెళ్ల రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని 30మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి నేషన్ బిల్డర్ అవార్డుతో సత్కరించారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి, రోటరీ జిల్లా 3150 మాజీ గవర్నర్లు తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చెరుకూరి శరత్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ గార్లపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను చక్కదిద్ది, మంచి భవిష్యత్తు కలిగించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమానికి సెక్రటరీగా గంట వేణుగోపాల్, ప్రోగ్రాం చైర్మన్ అనంతుల కుమారస్వామి, క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, వైద్యనాథ్, రాజయ్య, రఘువీర్, సురేష్, కృష్ణమోహన్, టీవీ.నాగరాజు, నరసింహారావు, సుధాకర్, బాస్కర్ రెడ్డి, రమేష్‌బాబు, శివప్రసాద్, హరిరమాదేవి, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, రవీందర్, శ్రీకాంత్, క్రాంతికుమార్, విజయ్‌కుమార్, తిరుపతి రెడ్డి, ధర్మేంద్ర, ఎల్లరాజు, భాస్కర్, మదన్ మోహన్, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.



అవార్డు పొందిన ఉపాధ్యాయులతో క్లబ్ సభ్యులు

ఇళ్ల నుంచి వచ్చిన మైనర్ ప్రేమికులు

గిర్మాజీపేట, సెప్టెంబరు 23 : మైనారిటీ తీరని ఆ ఇద్దరు ప్రేమించుకున్నారు. పైగా తమ ఇళ్లలో చెప్పకుండా రైలెక్కారు. చివరకు బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు.. ఆ తర్వాత వరంగల్ రైల్వే పోలీసులకు వచ్చిన సమాచారంతో వారిని వరంగల్ రైల్వే పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఆ ఇద్దరిని వారి తల్లిదండ్రులకు అ ప్పగించారు. వరంగల్ రైల్వే పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మధ్య ప్రదేశ్ రాష్ట్రం జబల్పూరుకు చెందిన బాలిక (16), బాలుడు(17) ప్రేమ మోజులో ఇంట్లో చెప్పకుండా శనివారం జబల్పూరు నుంచి చెన్నై వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఈ క్రమంలో తమ కూతురిని బాలుడు కిడ్నాప్ చేశాడంటూ ఆమె తల్లిదండ్రులు జబల్పూరు మజౌలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో వెంటనే అక్కడి పోలీసులు జబల్పూరు రైల్వే స్టేషన్ సీసీ కెమెరాల ఆధారంగా ఆ ఇద్దరు రైలు ఎక్కినట్టు గుర్తించి.. రైల్వే కంట్రోల్ ద్వారా వరంగల్ రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ఆదివారం రాత్రి ఆరైలు వరంగల్‌కు చేరుకున్న క్రమంలో వరంగల్ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ బృందాలు తనిఖీ చేసి మైనర్ ప్రేమికులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రైల్వే మహిళ పోలీసుల సహకారంతో అదేరాత్రి బాలికను సఖీ సెంటర్‌కు, బాలుడిని ప్రభుత్వ బాలుర పరిశీలక గృహానికి తరలించారు. సోమవారం ఉదయం వరంగల్ చేరుకున్న బాలిక తల్లిదండ్రులు, మాజౌరి ఎస్సైకి హనుమకొండలోని సీడబ్ల్యూసీ ద్వారా వారిని అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

శంభునిపేట, సెప్టెంబరు 23: తల్లిదండ్రులు మందలించారని ఇంట్లో నుంచి పారిపోయిన బాలుడిని మామునూరు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ కథనం ప్రకారం బొల్లికుంటకు చెందిన 12ఏళ్ల బాలుడు ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని తండ్రి మందలించటంతో సైకిల్ వేసుకొని ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అనంతరం బాలుడి తండ్రి మామునూరు పోలీసులకు సమాచారం అందించాడు. బెటాలియన్ వద్దగల పెట్రోల్ పంప్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించి బాలుడు వరంగల్ వైపు సైకిల్‌పై వెళ్లినట్టు గుర్తించారు. ఖిలావరంగల్ కోటలో చక్కర్లు కొడుతున్న బాలుడిని గుర్తించారు. ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుల్‌లను ఏసీపీ తిరుపతి, సీఐ రవికుమార్‌లు అభినందించారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 23: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 74 మంది వాహనదారులకు జరిమానా, ఒక వాహనదారుడికి జైలుశిక్షను సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 74మంది వాహనదారులకు రూ.1,07,000 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 23 మంది వాహనదారులకు రూ. 24,500 విధించినట్లు తెలిపారు.

డివిజన్ అధ్యక్షుడిపై ఫిర్యాదు?

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 23: నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడిపై అదే డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. డివిజన్ అధ్యక్షుడు సందీప్ అదే డివిజన్ కార్పొరేటర్ పుర్ణాన్‌పై వ్యక్తిగత దూషణలు చేసినట్లు కార్పొరేటర్ డివిజన్ అధ్యక్షుడిపై పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు డివిజన్ అధ్యక్షుడిని పీఎస్‌కు తీసుకొచ్చిన విషయం పెద్దది చేయకుండా కాంప్రమైస్ ధోరణిలో మాట్లాడుకున్నట్లు తెలిసింది.

మిస్సింగ్ కేసు నమోదు

కరీమాబాద్, సెప్టెంబరు23: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య కథనం ప్రకారం రంగశాయిపేటకు చెందిన పాలకుర్తి సతీష్, గతనెల 25న ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం తన చిన్నకూతురు నోట్‌బుక్కులో 'అనిత నన్ను క్షమించు, నా గురించి వెతకవద్దు, నేను మళ్లీ తిరిగిరాను, ఐ మిస్‌యూ, సారీ' అంటూ రాసిపెట్టింది చూశారు. దాంతో సతీష్ భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీమాబాద్, సెప్టెంబరు 23: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన కింసారపు అభిలాష్ త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ సీలేరు నుంచి తక్కువ రేటుకు దిగుమతి చేసుకొని నగరంలో అమ్మాలని రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ఎస్సై సురేష్ శివనగర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకోగా అసలు విషయం వెల్లడించాడు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 24 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం, సెప్టెంబరు 23 : అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దతండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామపార్టీ అధ్యక్షుడు గుగులోతు భిక్షపతి ఆధ్వర్యంలో సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని తెలిపారు. గ్రామాల్లో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామసభలో కోతుల, కుక్కల బెడదపై చర్చ



గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

నెక్కొండ, సెప్టెంబరు 23 : నెక్కొండలో కోతుల , కుక్కల బెడద అధికంగా ఉందని పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారని ప్రజలు అధికారులకు తెలిపారు. సోమవారం గ్రామ కార్యదర్శి సదానందం అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. కోతులు గ్రామంలోనే కాకుండా పంట పొలాల్లో స్వైరవిహారం చేస్తూ పంటలను పాడుచేస్తుండడంతో రైతులు నష్టాలకు గురవుతున్నారన్నారు. కుక్కలకు ఈ నెల చివరి వారంలో యాంటిరాబిస్ ఇంజక్షన్ వేయిస్తామని పశువైద్యాధికారి డాక్టర్ మమత తెలిపారు. కోతుల నివారణకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక బడ్జెట్‌లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామని కార్యదర్శి సదానందం చెప్పారు. నెక్కొండలో విద్యుత్ సరఫరాలో తరచు అంతరాయం కలుగుతుందని రాత్రి సమయంలో గంటల తరబడి విద్యుత్ సరఫరా ఉండడంలేదని, ఈ విషయమై విద్యుత్ అధికారులకు ఫోన్‌చేసినా వారు లిఫ్టుచేయడంలేదని పలువురు ఆరోపించారు. త్వరలో జరగనున్న బతుకమ్మ, దసరా వేడుకలను ప్రజలు నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో హై స్కూల్, పీఎస్ హెడ్మాస్టర్లు రంగారావు, భిక్షపతి, ఏఈవో వసంత, సంజీవ్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో గంజాయి కలకలం



వర్ధన్నపేటలో గంజాయిని పరిశీలిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 23 : వర్ధన్నపేట పట్టణంలో గంజాయి కలకలం సృష్టించింది. 27.41 కిలోల ఎండు గంజాయిని పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో గంజాయి బ్యాగులను, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అక్కడే వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, అదనపు ఎస్ఐ మేరుగు రాజులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామాచేసి స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయిని సీజ్ చేశారు. నిందితుల వాంగ్మూలాలు, సాక్షుల పంచులను తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... బీహార్‌కు చెందిన వివేక్ కుమార్, ధర్మేందర్ మలాకర్, బాబీదేవి, ద్రౌపదిదేవి గంజాయిని బ్యాగుల్లో ఢిల్లీకి తరలించే క్రమంలో వర్ధన్నపేట బస్టాండ్ సమీపంలో పోలీసులకు అనుమానాస్పందగా ఉండడంతో పట్టుకున్నారు. ఈ గంజాయి విశాఖపట్నం నుంచి తీసుకువస్తున్నట్లు స్పష్టం చేశారు. కేజీ గంజాయి రూ.25 వేల చొప్పున రూ. 6,85,250 ఉంటుందని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

విజిలెన్స్ విచారణ నిజమే

- విజిలెన్స్ అధికారులు వివరాలు అడిగారు
- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలకు కమిషనర్ స్పందన

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 23 : ఆంధ్రజ్యోతి వరుస కథనాలకు మునిసిపాలిటీ అధికారులు స్పందించారు. రూ.6 కోట్ల అక్రమాలు అనే శీర్షికతో వచ్చిన కథనంపై మునిసిపాలిటీ కమిషనర్ జోనా స్పందించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 13న విజిలెన్స్ అధికారులు 2018-2023 వరకు చెల్లింపుల బిల్లులు మునిసిపాలిటీ కార్యాలయం నుంచి సమర్పించాలని కోరినట్లు నిర్ధారించారు. సంబంధిత పూర్తి వివరాలు త్వరలోనే విజిలెన్స్ అధికారులకు అందచేయనున్నట్లు స్పష్టం చేశారు. 2024 మార్చి మాసంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.25 లక్షలు మునిసిపాలిటీ జమయ్యాయని, వాటి నుంచి రూ. 22 లక్షలు బిల్లులు సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించినట్లు తెలిపారు. సాధారణ నిధులు, ఇతర విధాలుగా రావాల్సిన నిధులు లేని కారణంగా కౌన్సిలర్లు చేసిన పనులకు, వారి గౌరవ వేతనాలు చెల్లించలేకపోతున్నామని స్పష్టం చేశారు. దీని కారణంగానే కొంత మంది కౌన్సిలర్లు దుష్ప్రచారం చేస్తూ, అధికారులను, కిందిస్థాయి సిబ్బందిని వ్యక్తిగతంగా వేధిస్తున్నారని వివరించారు.

బాబోయ్ దోమలు..

మునిసిపాలిటీ, పంచాయతీల పరిధిలో పడకేసిన పారిశుధ్యం

కానరాని ఫాగింగ్.. జ్వరాల బారిన జనం

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

నర్సంపేట, సెప్టెంబరు 23 : నియోజకవర్గ కేంద్రమైన నర్సంపేటలో దోమలుబెడద అధికంగా ఉంది. ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైరవిహారం చేస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విడ్డూరంగా వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడ పడిత అక్కడ నీరునిలిచిపోయింది. పారిశుధ్య నిర్వాహణ అంతంత మాత్రంగా ఉంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన చాలా మంది వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ జ్వరాలతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. కొందరు జ్వరాల బారినపడి చికిత్సలు పొంది నయమైన వారున్నారు. జ్వరాల బారిన పడే వారి సంఖ్య పెరుగుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో చలనం లేకుండా పోయిందన్న విమర్శలు వినవస్తున్నాయి.

పారిశుధ్య సమస్య తీవ్రం

మునిసిపాలిటీ పరిధిలోని 24వార్డుల పరిధిలో పారిశుధ్య సమస్య తీ వ్రంగా ఉంది. జనాభా కనుగుణంగా పారిశుధ్య కార్మికులు ఉన్నా ఈ సమస్య తగ్గడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో మురికి కాలువల నిర్వాహణపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించడంలేదు. దీంతో ఈ సమస్య రోజురోజుకు పెరిగిపోతుంది. పట్టణంలోని కాలనీలు, కొన్ని వార్డుల్లోని వీధులు, ప్రధాన రోడ్ల పక్కన సైడ్ కాల్వల నిర్మాణాలు లేక మురికి నీరంతా రోడ్ల పక్కన నిలిచి దోమలకు ఆవాసాలుగా మారిపోతున్నాయి. దోమల బెడద ఎక్కువవుతుంది. ఇప్పటికే పట్టణంలో విషజ్వరాల బారిన, టైఫాయిడ్ జ్వరాలతో ఇబ్బందులు పడుతూ మృతి చెందిన సంఘటనలు వెలుగుచూశాయి.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యాచరణ శూన్యం

కార్పొరేషన్ స్థాయికి ఎదుగనున్న నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అవగాహన కల్పించే అధికారులు, ప్రజా ప్రతినిధులు కరువయ్యారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతూ వేలాది రూపాయలను ఖర్చు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వివిధ జ్వరాల బారిన పడిన వారు తక్కువలో తక్కువ రూ.8 వేల నుంచి ఒక లక్ష వరకు వైద్యఖర్చుల కోసం ఖర్చు చేయాల్సి వస్తున్నా అధికారులు పారిశుధ్యంపై దోమల బెడదను అరికట్టే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు బాహటంగా విమర్శిస్తున్నారు.

దోమల నివారణపై ప్రత్యేక పర్యవేక్షణ కరువు



నర్సంపేటలోని గాంధీనగర్‌లో అధ్వానంగా డ్రెయినేజీ

కొన్నేళ్ల క్రితం దోమల నివారణపై ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాలపై ప్రతివారం పారిశుధ్య నిర్మూళన, దోమలను అరికట్టే విషయంలో సిబ్బందిపై పారిశుధ్యనిర్మూళన, పరిసరాల పరిశుభ్ర కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేవారు. దోమల నివారణకు ఫాగింగ్, మురికి కాల్వల్లో పూడికతీత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. అధికార ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పారిశుధ్య నిర్వాహణ అధ్వాన్నంగా మారుతుంది. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లోని అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసి ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో కూడా దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామంటున్న నేతలు ప్రజలు ఆనారోగాలకు గురికాకుండా ప్రత్యేకంగా పారిశుధ్య నిర్మూళనపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

అమీనాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మాణం చేస్తాం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబరు 23 : అమీనాబాద్‌లో విద్యార్థుల చదువు కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాలలో రూ.30లక్షలతో నిర్మాణం చేపట్టనున్న డైనింగ్ హాల్ నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మోడల్ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి హాస్టల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పాఠశాలకు సమీపంలోనే రూ.120కోట్లతో విద్యార్థులకు అధునాతన టెక్నాలజీతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మాణం చేస్తామన్నారు. అలాగే మండలంలోని కోనాపురం, పాపయ్యపేట గ్రామాల్లో నూతనంగా నిర్మాణంచేసిన ప్రాథమిక హెల్త్ సెంటర్‌లను ఆయన ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో అర్హులైన 72మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న మండల పరిషత్ భవనాలను అధికారులతో కలిసి పరిశీలించారు. నూతన భవనాల కోసం నిధులను అందిస్తామన్నారు.

వైద్యాధికారి, వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

మండలంలోని కోనాపురం హెల్త్ సెంటర్ ప్రారంభం అనంతరం సబ్ సెంటర్‌లోని రిజిష్టర్‌లను ఎమ్మెల్యే మాధవరెడ్డి పరిశీలించి వైద్యాధికారి సరోజ, వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెల్త్ సెంటర్‌లో ఓపీ సరిగా లేకపోవడంపై, వైద్యాధికారి సబ్ సెంటర్‌ను తనిఖీ చేసినట్లు రిజిష్టర్‌లో వైద్యాధికారి సరోజ సంతకం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు పెండెం రామనంద్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి. మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్, డాక్టర్ సరోజ, ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ ఫణికుమార్, మజ్జిక రాంబాబు, యూత్ అధ్యక్షుడు బండి హరీష్, కుండె కుమారస్వామి, కిసాన్ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు మధుసూదన్‌రెడ్డి, ఈర్యనాయక్, రూపిక శ్రవణ్, మాజీ బండి బాలరాజు. సిద్దెన మల్లేష్, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేయాలి

మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే మాధవరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక సేవలను అందిస్తున్నామని, ఇప్పటివరకు ఉద్యోగులకు కనీస వేతనాన్ని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని వారు ఎమ్మెల్యేను కోరుతూ వినతి పత్రం అందించారు.

- నెక్కొండ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగాపాలన సాగిస్తున్న ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధికి అనేక రకాల సంక్షేమ పథకాలను అందించేందుకు రూపకల్పన



అమీనాబాద్‌లో మోడల్ పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. సోమవారం నెక్కొండలోని తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీచేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, కుసుమ చెన్నకేశవులు, రాచకొండ రఘు, సాయికృష్ణ, రావుల తిరుపతి రెడ్డి, ఎండీ అన్వర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 23 : హైదరాబాద్‌లోని తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదని, పాలకులు వెంటనే నిర్ణయం మార్చుకోవాలని ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కమిటీ అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్, పబ్బ రమేష్, తోట బాలభాస్కర్‌గుప్త, ప్రభాకర్, నరేందర్, రాంనాథం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఖానాపురం : హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యా లయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసంకాదని ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు మల్యాల



నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పోశెట్టి అన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల కార్యదర్శి గుండా రామకృష్ణ, కోశాధికారి కృష్ణమూర్తి, సురేష్, కృష్ణమూర్తి, శశిప్రీతం, సోమయ్య, నరహరి, బాలకృష్ణ పాల్గొన్నారు.

- నల్లబెల్లి: పొట్టి శ్రీరాములు పేరుతో ఉన్న తెలుగు విశ్వ విద్యాలయానికి ఆ పేరు తొలగించి ఆర్య వైశ్యులను కించపరిచే విధంగా చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరి సరికాదని ఆర్యవైశ్య సంఘం బాధ్యులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శాంతియుత ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నీలా శ్రీనివాస్, వరంగల్ జిల్లా కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం నల్లబెల్లి మండల కార్యదర్శి గంగిశెట్టి నాగభూషణ్, మురికి మనోహర్, పట్టణ అధ్యక్షుడు రవీందర్, గంగిశెట్టి శ్రీనివాస్, నీలా శ్రీనివాస్, శివప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభావృద్ధి సాధించాలి



పర్వతగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, సెప్టెంబరు 23 : గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా మండల సమైఖ్య 18వార్షిక మహసభ సమావేశాన్ని ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మహిళల కోసం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకువచ్చారని, మహిళలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.ఇందిరా మహిళా శక్తి ద్వారా పౌల్ట్రీ ఫాం, ఐస్‌క్రీమ్ కంపెనీ, మెడికల్ షాపుల ఏర్పాటు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో రేణుకాదేవి, తహసీల్దార్ వెంకటస్వామి పాల్గొన్నారు.

కొత్త రుణాల మంజూరుకు సహకరించండి

వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ల్యాబర్తి గ్రామంలో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రుణమాఫీ జరిగిన రైతులకు కొత్త రుణాలు ఇచ్చేలా చొరవ చూపాలని ఎమ్మెల్యే నాగరాజును సోమవారం నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కుల్ల యాకాంతం కోరారు. బ్యాంకర్లు రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

డిపో ఆదాయం పెంచేందుకు కృషి చేసిన డ్రైవర్, కండక్టర్లకు అభినందన

నర్సంపేట, సెప్టెంబరు 23 : నర్సంపేట డిపో ఆదాయం పెరగడానికి కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలను అందజేసి డిపో మేనేజర్ ప్రసూన రాణి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉద్యోగులు ఎక్కువ మంది ప్రయాణీకులను ఆర్టీసి బస్సుల్లో తీసుకు విచ్చి డిపో ఆదాయం పెరగడానికి కృషిచేశారని, ఇలా కృషి చేసిన వారిని అభినందిస్తున్నామ న్నారు. డిపోలో పనిచేసే కార్మికులు డిపో ఆదాయం పెరగడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్, ప్రభాకర్, సూపరింటెండెంట్ రంజిత్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు డీఎస్.నారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన కుటుంబ వ్యవస్థ బలపడాలి

గీసుగొండ, సెప్టెంబరు 23 : విలువలతో కూడిన కుటుంబ వ్యవస్థ బలపడితేనే సమాజంలో అన్ని రుగ్మతలు నిర్మూలించబడుతాయని సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. లింగవివక్ష, హింస నివారణ రక్షణ చట్టాలపై గందేవిపల్లిలో సర్వోదయ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, సంగెం, గీసుగొండ మండలాల నుంచి అంగన్‌వాడీ టీచర్‌లు, సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి, సూపర్‌వైజర్ అరుణ, సువర్ణ, లలిత, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాలధారణ

గీసుగొండ, సెప్టెంబరు 23: ఊకల్‌లో నాగమయ్య ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాలధారణ సోమవారం ఘనంగా నిర్వహించారు. 41రోజుల దీక్షను చేపట్టారు. నాగులచవితి రోజు నాగబంధ కావడంతో ఆలయానికి తరలివచ్చి దీక్షచేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కోశాధికారి రాజేందర్ పాల్గొన్నారు.

డీసీసీ జిల్లా అధ్యక్ష పదవి గౌడలకే ఇవ్వాలి

గీసుగొండ, సెప్టెంబరు 23 : వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవీ గౌడ సమాజిక వర్గానికే ఇవ్వాలని గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ధర్మారంలో ఆయన మాట్లాడుతూ జిల్లా గౌడ జనాభా ఎక్కువగా ఉందన్నారు. త్వరలో గౌడ్‌లకు జరిగిన అన్యాయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి వివరించనున్నట్లు తెలిపారు.

గణిత అధ్యాపక పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం, సెప్టెంబరు 23 : మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపక పోస్టును అవర్లీ బేస్డ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పెర్క సునీత ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆగ్ల మాధ్యమంలో బోధించడానికి ఎమ్మెస్సీ, బీఎడ్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 26న పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమో క్లాస్‌లకు హాజరుకావాలన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరాలు

దుగ్గొండి, సెప్టెంబరు 23: మండలంలోని గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విద్యాలయం, దుగ్గొండి ఉన్నత పాఠశాలలో సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సంపేట మెడికల్ కళాశాల డాక్టర్ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో అసిస్టెంట్‌ప్రొఫెసర్ మురళి, డాక్టర్లు పాల్గొన్నారు.

నారు పంపిణీ చేసే నర్సరీలు నిబంధనలు పాటించాలి

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 23 : మిరుప, కూరగాయల నారు పంపిణీచేసే నర్సరీలు తప్పకుండా నిబంధనలు పాటించాలని జాయింట్ డైరెక్టర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి సోమవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మిరుప, కూరగాయలు తదిత ర సుగంధ ద్రవ్యాల పంటలకు విత్తనాలకు బదులు నారు మొక్కలను స్థానిక నర్సరీల్లో రైతులు కొనుగోలు చేస్తున్నారని, తెలంగాణ ప్రభు త్వం కల్తీనారును అరికట్టేందుకు ఆరోగ్యకరమైన నారును అందుబటులోకి తెస్తోందని పేర్కొన్నారు. జిల్లాలోని నర్సరీలను ఉద్యానవనశాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొని చట్టప్రకారం పెంచాలని తెలిపారు. లైసెన్సు లేకుండా నర్సరీలో మిరుప, కూరగాయల నారు క్రయవిక్రయాలు జరుపొద్దని పేర్కొన్నారు. లేదంటే పీడీ యాక్ట్, అలాగే రూ.50 వేల జరిమానా విధించబడుతందని హెచ్చరించారు. మండలాల వారీ గా ఉద్యానశాఖ అధికారుల నియమించడం జరిగిందని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి వరంగల్ ఎస్.తిరుపతి సెల్‌నంబర్ 89777 14060 (వరంగల్, ఖిలా వరంగల్, గీసుగొండ, సంగెం మండలాలు) ఎస్.తిరుపతి ఇన్‌చార్జి వర్ధన్నపేట సెల్‌నంబర్ 89777 14062 (వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాలు), ఉద్యానశాఖ అధికారి ఏ.జ్యోతి నర్సంపేట సెల్‌నంబర్ 8977714061 (నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాలు) ఉద్యానశాఖఅధికారి ఏ.జ్యోతి ఇన్‌చార్జ్ నెక్కొండ సెల్ నంబర్ 89777 14053 (నెక్కొండ, చెన్నారావుపేట, ఖానాపురం మండలాలు) ఆ ప్రకటనలో కోరారు.

గ్రామాల్లో ప్రారంభమైన బొడ్డెమ్మ ఆటలు

దుగ్గొండి, సెప్టెంబరు 23 : గ్రామాల్లో సోమవారం బొడ్డెమ్మ ఆటలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మ ఆటను ఆడి స్థానిక చెరువులలో బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమంలో కవిత, రశ్మిత, హసినీ, అర్చన, రమ, సునిత, రిషిత తదితరులు పాల్గొన్నారు.

వీడీఏ జిల్లా అధ్యక్షురాలికి సన్మానం

ఖానాపురం, సెప్టెంబరు 23: వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ (వీడీఏ) జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన మండల వెటర్నరీ డాక్టర్ శ్రీలక్ష్మిని సోమవారం వెటర్నరీ వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ అనిల్, ఓస్ ఎండీ మజీద్, గోపాల మిత్రలు లక్ష్మీనారాయణ, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ సైంటిఫిక్ ఆస్ట్రాలజర్‌గా శ్రావణ్‌శాస్త్రి



అవార్డు అందుకుంటున్న శ్రావణ్‌శాస్త్రి

నెక్కొండ, సెప్టెంబరు 23 : మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత బూర్గుపల్లి శ్రావణ్‌శాస్త్రి బెస్ట్ సైంటిఫిక్ ఆస్ట్రాలజర్ అవార్డును అందుకున్నట్లు సోమవారం విలేకరులకు తెలిపారు. తమిళనాడులోని తిరువన్నామలైలో నిర్వహించిన ఆధ్యాత్మిక జ్యోతిష్యుల సమ్మేళనంలో తాను పాల్గొన్నగా ఈ అవార్డును అందించారన్నారు. గ్రహదోషాలు-ఆధ్యాత్మిక పరిష్కారాలుఅనే అంశం పై పరిశీలనాత్మక పత్రం సమర్పించి, ప్రసంగించడంతో అవార్డుకు ఎంపికచేసి అందించారని తెలిపారు. సమ్మేళనానికి అరుణాచలక్షేత్ర ఆధ్యాత్మిక గురువు ఆనంద లింగేశ్వరస్వామి, తెలంగాణ రాష్ట్ర పురోహిత అర్చక సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి వివిధ రంగాలకు చెందిన పలువురు గౌరవ అతిథులుగా హాజరయ్యారన్నారు,

స్వచ్ఛతా హీ సేవాపై సమీక్షా సమావేశం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 23 : నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సానిటేషన్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై సోమవారం నర్సంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ గదిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో రాజ్‌కుమార్ ఆరు మండలాల్లో జరుగుతున్న సానిటేషన్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల తీరుపై ఎంపీవోలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తండాలో సమస్యలను పరిష్కరించాలి

నెక్కొండ, సెప్టెంబరు 23: మండలంలోని అజ్మీరామంగ్యతండా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి పది సంవత్సరాలు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ సత్యశారదకు సోమవారం హాతీరం సేవ యూత్ సభ్యులు ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందించారు. సమస్యలను పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలను జారీచేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు భూక్య మోహన్, గుగులోతు గణేష్, సజ్జన్, బాలు, రమేశ్, గోపి, శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'రేపటి కులగణన మార్చ్‌కు తరలిరండి'

నర్సంపేట, సెప్టెంబరు 23 : హైదరాబాద్‌లో ఈ నెల 25న జరిగే కులగణన మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా నాయకుడు డేగల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. పట్టణంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో జరిగే కుల గణన మార్చ్ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాలతో పాటు నర్సంపేట నియోజకవర్గంలోని బీసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, సంకటి శ్రీనివాస్, మద్దెల శ్యామ్‌కుమార్, ఓడపల్లి రమేశ్, రాజేందర్, భాస్కర్. శ్రీనివాస్, క్రాంతికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా హక్కుల రక్షణకు ఉద్యమాలే శరణ్యం

నర్సంపేట, సెప్టెంబరు 23 : మహిళా హక్కుల రక్షణకు పోరాటాలే శరణ్యమని ఏఐఎఫ్‌డిడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సోమవారం సమావేశాన్ని గటికె మమత, తుత్తురు రాజక్క అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను సామాజికంగా, ఆర్థికంగా ఎదుగనీయకుండా అణచివేస్తున్న పురుషాధిక్య సమాజంలో మహిళల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలను నిలదీయాలని ఆమె పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, గోనె కుమారస్వామి, నర్రా ప్రతాప్, కన్నం వెంకన్న, కొత్తకొండ రాజమౌళి, మార్త నాగరాజు, గటిక జమున, మార్త సుధ, పేరబోయిన రమ, గడ్డం స్వరూప, చొప్పరిపద్మ, పెండ్యాల లలిత, మామిండ్ల వీరలక్ష్మి పాల్గొన్నారు.

కట్ర్యాలలో ఎస్‌జీఎఫ్ఐ సమావేశం

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 23 : మండలంలోని కట్ర్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో అండర్ 14 బాలికల విభాగం, అండర్ 17 బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు.